క్లుప్తంగా

మలికిపురం ఎంపీడీఓగా వీరాస్వామి



మలికిపురం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ముత్యం వీరాస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇన్‌చార్జి ఎంపీడీఓగా పని చేసిన ఉండ్రు బాబ్జీరాజు పదోన్నతిపై పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీఓకు సూపరింటెండెంట్ జి.మిల్టన్, ఈఓపీఆర్‌డీ బి. మంగాదేవి, కార్యదర్శులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

మండల ఇంజినీరింగ్ జేఈగా మురళీకృష్ణ



ఆలమూరు: మండల ఇంజినీరింగ్ జేఈగా కోటిపల్లి మురళీకృష్ణ నియమితులయ్యారు. ప్రస్తుతం మండల ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న కొత్తపేట ఇంజినీరింగ్ జేఈ డి.వీరభద్రరావు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం మురళీకృష్ణ రాజమహేంద్రవరంలోని జిల్లా ఇంజినీరింగ్ కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా పనిచేస్తూ బదిలీపై మండలానికి విచ్చేశారు. గతంలో జేఈగా పనిచేసిన అనుభవంతో మండలంలో చేస్తున్న అన్ని అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జేఈ తెలిపారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



ఆలమూరులో చిన్నారులకు టీకాలు అందజేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలానాయుడు పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. సీహెచ్ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎన్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లను అందజేశారు.

నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలి

అంబాజీపేట: రహదారులు, వంతెన నిర్మాణాలను ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని సర్పంచ్ కోట బేబీరాణి, వైఎస్ ఎంపీపీ నేతల నాగరాజులు అన్నారు. చిరతపూడిలో నిర్మిస్తున్న వంతెన, రహదారు పనులను బుధవారం వారు పరిశీలించారు. ఎస్ఎస్ నగర్‌లో పంట కాలువపై వంతెన నిర్మాణాన్ని రూ.6 లక్షలతోను, శ్మశాన వాటికక వెళ్లే రహదారిని రూ.5 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. గ్రామాభివృద్ధిని అందరి సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

అంబాజీపేట: ముక్కామల ప్రధాన రహదారిలో బైక్ మహిళను ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ముక్కామల శివారు శ్రీరామపురానికి చెందిన రెడ్డి వెంకటలక్ష్మి ఈ నెల 6న తన ఇంటి ఎదురుగా ఉన్న ప్రధాన రోడ్డును దాటుతుంది. అదే సమయంలో కొత్తపేట నుంచి అమలాపురం వైపు వెళుతున్న మోటారుసైక్లిస్ట్ వెంకటలక్ష్మిని బలంగా ఢీకొట్టాడు. దాంతో స్థానికులు అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణపై హర్షం


ఆలమూరు: జిల్లా వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్టుపై పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంపై ఆ శాఖ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లుగా ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్న తమను సీఎం జగన్ అధ్యక్షతన బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకోవడంపై మండల కాంట్రాక్ట్ ఉద్యోగుల ప్రతినిధి వి.సుబ్బారావు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

మండల ఉద్యానశాఖ అధికారి బదిలీ

అయినవిల్లి: మండల ఉద్యానశాఖ అధికారి ఎం.బబిత బదిలీ అయ్యారు. ఈమె ఇంతవరకూ మండల ఉద్యాన శాఖ అధికారి పనిచేసి తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లకు బదిలీపై వెళ్లారు.

కలవరపెడుతున్న గోదావరి కోత

- నదిలో కూలిపోతున్న చెట్లు
- ఆందోళనలో రైతులు



అప్పనపల్లిలో గోదావరిలో కూలిపోతున్న కొబ్బరిచెట్లు



అప్పనపల్లిలో కొట్టుకుపోయిన గ్రోయిన్

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీతీరంలోని లంక గ్రామాల్లో నదీపాతం తీవ్రంగా ఉంది. గోదావరి కోత రైతులను తీవ్ర అందోళనకు గురిచేస్తోంది. రూ.కోట్లు విలువైన భూములు ఏటా నదీగర్భంలో కలిసిపోతున్నాయి. రోజు రోజుకూ నదీపాతం ఉధృతిమించడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. మండలంలోని పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, బాడిలంక, ఆదుర్రు గ్రామాల్లో కోత ప్రభావం తీవ్రంగా ఉంది. అప్పనపల్లిలో బాలబాలాజీ స్వామి స్నానఘట్టం వద్ద కోత అధికంగా ఉంది. పెదపట్నంలంకలో బొక్కావారిపాలెం, బి.దొడ్డవరం సరిహద్దులోను, పాశర్లపూడి ఉత్తరబాడవ, చింతలమెరక ప్రాంతాల్లోను, ఆదుర్రులోని మోరిపాలెం సమీపంలోను నదీ కోత తీవ్రంగా ఉంది. కోత నివారణకు రివిట్‌మెంట్‌తో పాటు గ్రోయిన్లు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉన్నా ఆ దిశగా తీసుకుంటున్న చర్యలు శూన్యమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కనుమరుగవుతున్న గ్రోయిన్లు...

గోదావరి నీటి ప్రవాహాన్ని మళ్లించి తద్వారా కోతను నివారించేందుకు గతంలో నిర్మించిన గ్రోయిన్లు, రివిట్‌మెంట్లు గోదావరి నదిలోకి జారిపోతున్నాయి. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు, తదితర గ్రామాల్లో ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది. పై గ్రామాల్లో కొన్ని చోట్ల గ్రోయిన్లు నదిలో కలిసిపోయాయి. మరికొన్ని చోట్ల గ్రోయిన్లు పాడై పోవడంతో నదీపాతం మరింత ఎక్కువయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పాడైపోయిన గ్రోయిన్లతో పాటు రివిట్‌మెంట్లకు కనీసం మరమ్మతులైనా చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఆ దిశగా అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపించాలని కోరుతున్నారు.

నేదునూరులో కొండచిలువ హల్‌చల్



కొండచిలువ కళేబరం

అయినవిల్లి: మండలంలోని నేదునూరులో ఓ పొలంలో ఉపాధి పనులు చేస్తుండగా కొండచిలువ హల్‌చల్ చేసింది. దీంతో కూలీలు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. అందులో కొంత మంది ధైర్యం చేసి కొండచిలువలను హతమార్చారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

దాతల సహకారం అభినందనీయం



నందంపూడిలో పాఠశాల నిర్మాణ దాతలను సన్మానిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: శిథిలమైన ప్రాథమిక పాఠశాల భవన శ్లాబు నిర్మాణానికి అవసరమైన మొత్తాన్ని అందించి నిర్మించిన దాతల సహకారం అభినందనీయమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంఈఓ జీవీఎల్ కనకదుర్గ అన్నారు. నందంపూడి శివారు ముహూర్తాల చెరువు గట్టులో గత ఏడేళ్లుగా ప్రాథమిక పాఠశాల శ్లాబ్ శిథిలమైపోవడంతో దాతల సహకారంతో నిర్మించిన భవనాన్ని బుధవారం ప్రారంభించారు. పలుమార్లు 'సాక్షి' దినపత్రికలో శిథిలమైన భవనాన్ని నిర్మించాలని వార్తా కథనాలు వెలువడటంతో దాతలు ముందుకు వచ్చి అభివృద్ధి చేశారు. పాఠశాల శ్లాబ్ నిర్మాణానికి, భవన మరమ్మతులకు అవసరమైన రూ.3.50 లక్షలను ఇళ్ల శ్రీకల్యాణ్, శ్రీవీణ దంపతులు సమకూర్చినట్లు ప్రధానోపాధ్యాయుడు నంద్యాల జీవీఎస్‌కె.నాయుడు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను స్థానికులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పితాని మంగాదేవి, మట్టపర్తి బాలాజీ, వడ్లమాని కామేశ్వరరావు, మట్టపర్తి సూర్యకుమారి, మట్టపర్తి నాగేశ్వరరావు, నాగాబత్తుల శశి తదితరులు పాల్గొన్నారు.

మేధాశక్తిని పెంచుకునేందుకు శిక్షణలు ఉపయోగం



అంబాజీపేటలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

అంబాజీపేట: వేసవిలో నిర్వహించే ఉచిత శిక్షణ శిబిరాల వల్ల మేధాశక్తి పెంచుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయని ఎంఈఓ జీవీఎల్ కనకదుర్గ, తహసీల్దార్ టి.మంగతాయారు, ఎస్సై ఎ.చైతన్యకుమార్‌లు అన్నారు. హైదరాబాద్‌కు చెందిన వినాయక యాడ్స్ ఆధ్వర్యంలో అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో నెల రోజుల పాటు నిర్వహించిన ఉచిత ఇంగ్లీష్ మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ తరగతుల శిక్షణ ముగింపు కార్యక్రమం హెచ్‌ఎం బీర హనుమంతరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. వారు మాట్లాడుతూ శిక్షణాలో నేర్చుకున్న ఇంగ్లీషును ప్రతి రోజు చదువుకోవడం వల్ల ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సమాజంలో ఉన్నత స్థానానికి ఎదిగిన వారు సమాజానికి సేవ చేయాలనే దృక్పథం రావడంపై వినాయక యాడ్స్ అధినేత బొక్కా వినాయకరావును పలువురు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఇంగ్లీష్ మరియు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నిర్వహించిన పోటీల్లో ఎస్.రమ్య, వి.ఐశ్వర్య, పి.సూర్యమోహన్‌లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అశ్వా చైర్మన్ కామిశెట్టి శ్రీనివాస్ (మధు), బొక్కా అర్జునరావు, బొంతు రమేష్, జె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా వలంటీర్ వ్యవస్థ



పి.గన్నవరంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: సీఎం జగన్ ప్రవేశపెట్టిన గ్రామ వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే చిట్టిబాబు అన్నారు. వలంటీర్లకు వందనంలో భాగంగా స్థానిక గ్రేస్ డిగ్రీ కళాశాల ఆవరణలో మండలంలోని 429 మంది వలంటీర్లను బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టిబాబు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ టీఎస్ వెంకటాచార్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. ప్రభుత్వ పథకాలన్నీ వలంటీర్లతో డోర్ డెలివరీ చేయిస్తున్న ఘనత జగన్‌కే దక్కిందన్నారు. గతంలో చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకున్నాయని, నేడు మన ప్రభుత్వంలో కుల, మత, వర్గ రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను వలంటీర్ల ద్వారా అందిస్తున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. వలంటీర్ ఉద్యోగాన్ని ప్లాట్‌ఫామ్‌గా ఉపయోగించుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి, ఎంపీడీఓ ఎం.భారతి, మండలశాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, మండల జేసీఎస్ అధ్యక్షుడు దొమ్మేటి దుర్గారావు, పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకటసాయిరామ్, దొమ్మేటి వెంకటశివ రామన్, పితాని నర్సింహరావు, సాధనాల రమేష్, కుంపట్ల గోపి, స్థానిక సర్పంచ్ బొండాడ నాగమణి, ఆదిమూలం సూరయ్యకాపు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జగన్ సారథ్యంలో రాష్ట్రం సుభిక్షం



పాశర్లపూడిలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలంతా ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం పాశర్లపూడిలో జరిగింది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వివిధ వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జననేత జగన్‌కు మీ ఆశీస్సులు అందించాలంటూ ప్రజలను కోరారు. ప్రతిపక్షాలు చెప్పే మాటలు విని మోసపోవద్దని సూచించారు. విజ్ఞతతో ఆలోచించి, సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌కు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ, పీఎంసీ చైర్మన్ పిల్లి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు, మాజీ ఎంపీటీసీ తోలేటి ఆదినారాయణమూర్తి, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, పార్టీ నాయకులు తోరం సూర్య భాస్కర్, తులా గోపాలకృష్ణ, వాసంశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికే..

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



రావులపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడానికి ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు వివరించి, సమస్యలను పరిష్కరించేందుకు, ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు ప్రతి గడపకు వస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం రావులపాలెం మండలం రావులపాలెంలోని సచివాలయం–3 పరిధిలో పర్యటించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి, ప్రజలకు తమ ప్రభుత్వంలో చేసిన మంచి ఇది అని ధైర్యంగా చెప్పడానికి, ప్రజలు తామెదుర్కొంటున్న సమస్యలను చెబితే వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇలా ప్రజల ముందుకు వచ్చిన ఏకైక సీఎం జగన్ మాత్రమేనన్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే ఇది ఒక సువర్ణాధ్యాయమని జగ్గిరెడ్డి పేర్కొన్నారు. ఇలా ప్రజల దగ్గరికి జగనన్న వెళ్లడాన్ని దుష్టచతుష్టయం చూసి సహించలేకపోతోందన్నారు. రోజురోజుకీ జగనన్న ప్రజలకు చేరువవుతుంటే వారు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, విజ్ఞులైన ప్రజలే అవన్నీ గమనించాలని కోరారు. పేద ప్రజల సంక్షేమానికి నడుం బిగించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మనందరం మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సీఆర్‌సీ రోడ్డులో పంచాయతీ నిధులు రూ.32 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లు, 2 కల్వర్టులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సాకా మణికుమారి, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, ఎంపీటీసీ గూటం తిమోతి ప్రకాష్‌రావు, మాజీ ఎంపీటీసీ కర్రి వీరారెడ్డి, జవ్వాది రవిబాబు, వాడపల్లి దేవస్థానం సభ్యుడు మన్యం భాను, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, పితాని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.





● ఆత్మీయ స్వాగతం



మలికిపురం మండలం కత్తిమండలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కుమారుడి వివాహానికి హాజరైన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి హెలీప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న కొత్తపేట, పి.గన్నవరం ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, కొండేటి చిట్టిబాబు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు.

వినతులు అందుకుని.. భరోసా నింపి..

సాక్షి అమలాపురం/మలికిపురం: జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్థానిక ప్రజల నుంచి వినతి పత్రాలు నేరుగా స్వీకరించారు. వివాహ వేడుక నుంచి తిరిగి వెళుతున్న సమయంలో సీఎం జగన్‌కు దారిలో అనేక మందికి వినతి పత్రాలు ఇచ్చేందుకు ప్రయత్నించారు. వారిని గమనించిన సీఎం హెలీప్యాడ్ వద్దకు తీసుకు రావాల్సిందిగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఆదేశించారు. సుమారు గంట పాటు వారికి సమయం కేటాయించారు. ప్రతి అర్జీదారునితో సీఎం జగన్ ప్రత్యేకంగా మాట్లాడి నేనున్నాననే భరోసా కల్పించారు.

బోన్ క్యాన్సర్ వైద్యం కోసం

గత కొంతకాలంగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న రాజోలు మండలం సోంపల్లి గ్రామానికి చెందిన 18 ఏళ్ల మసకపల్లి అఖిల వైద్యం కోసం సాయం కోరుతూ సీఎం జగన్‌ను కలిశారు. తల్లిదండ్రులు శ్రీనివాసరావు, లక్ష్మిలతో కలసి ఆమె వచ్చింది. అఖిల కోలుకునేలా వైద్యం చేయిస్తామని సీఎం హామీ ఇచ్చారు. వైద్య సౌకర్యం కోసం కలెక్టర్ శుక్లాను కలవాల్సిందిగా సూచించారు. అలాగే ప్రమాదకర వ్యాధి బారినపడిన మలికిపురం మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన మేడిద సుజాత కూడా వైద్యం సాయం కోసం సీఎంకు వినతిపత్రం అందజేశారు.

డయాలసిస్ సెంటర్ కావాలని..

రాజోలు నియోజకవర్గంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని రాజోలు నియోజకవర్గ పరిరక్షణ సమితి సభ్యులు సీఎం జగన్‌కు వినతి పత్రం అందించారు. దీనిపై సీఎం కలెక్టర్ హిమాన్షు శుక్లాను పరిశీలించాలని సూచించారు. ఇది ఇప్పటికే పరిశీలనలో ఉందని కలెక్టర్ తెలిపారు. తమ విద్యాబోధన కోసం ఉపాధ్యాయులను నియమించాలని దివ్యాంగులు వినతిపత్రం అందించారు. యూఎస్‌టీఎఫ్ మహిళా అధ్యక్షురాలు తాడి సరిత, మెర్ల నాగ సత్యనారాయణ తదితరులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

పాటురేవుపై వంతెన నిర్మాణం కోసం నిరీక్షణ



పాటు రేవుపై ఏర్పాటు చేసిన సిమెంట్ తూరలు

మామిడికుదురు: పెదపట్నం గ్రామ పరిధిలోని వైనతేయ గోదావరి నదీ తీరంలో పాటు రేవుపై వంతెన లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శివాలయం సమీపంలో పాటు రేవు మధ్యలో కేవలం సిమెంట్ తూరలు మాత్రమే ఏర్పాటు చేశారు. ఈ మార్గం ద్వారానే రైతులు తాము పండించిన ఉత్పత్తులను ఇళ్లకు తీసుకు వెళ్తారు. ఎంతో కాలం క్రితం ఈ తూరలు ఏర్పాటు చేశారు. వీటి స్థానే పక్కా వంతెన నిర్మించాలని స్థానిక రైతులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. కానీ వంతెన నిర్మాణం మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. ఏటా వరదల సమయంలో సిమెంట్ తూరలు ఒక మాదిరి వరదకే ముంపుబారిన పడుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరదల సమయంలోనే కాకుండా భారీ వర్షాల సమయంలో సైతం రైతులకు అవస్థలు తప్పడం లేదు. వీటి నుంచి విముక్తి కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు అభ్యర్థిస్తున్నారు. ఈ మార్గంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మట్టి రోడ్లు నిర్మించారు. దీని వల్ల రైతులు పూర్తి స్థాయిలో ప్రయోజనం పొందాలంటే పక్కా రోడ్డు నిర్మించాల్సిన ఆవశ్యకత ఉంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు వంతెన నిర్మాణంతో పాటు గ్రావెల్ రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించాలని ఈ ప్రాంత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

'శివదేవ శతకం' పుస్తకావిష్కరణ

అమలాపురం టౌన్: బుర్ర కథ కళాకారుడు, రచయిత పండితారాధ్యుల సత్యనారాయణ రాసిన 'శివదేవ శతకం' పుస్తకాన్ని స్థానిక ఎర్రమిల్లివారి వీధిలోని ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ భవనంలో పలువురు సాహితీవేత్తలు, విద్యావేత్తలు బుధవారం ఆవిష్కరించారు. పుస్తకాన్ని సమీక్షించిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కేవీ ప్రభాకరశర్మ మాట్లాడుతూ శివ తత్వాన్ని బాగా గ్రహించిన పండితారాధ్యుల సత్యనారాయణ దానిని శతక రూపంలో మనకు అందించారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల సంస్కార భారతి శాఖల అధ్యక్షులు విశ్వ శ్రీనివాసశర్మ, ఆకొండి పవన్‌కుమార్, జిల్లా కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, వేదనభట్ల సాయిలక్ష్మి, శ్రీగిరి గోపాల కృష్ణ, పెమ్మరాజు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్లాబ్ కల్వర్టు పునరుద్ధరణ కోరుతూ ధర్నా



పెదపట్నంలో కూలిపోయిన శ్లాబ్ కల్వర్టు వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

మామిడికుదురు: టిప్పర్ల రాకపోకలతో కూలిపోయిన శ్లాబ్ కల్వర్టును పునర్నిర్మించాలని కోరుతూ పెదపట్నం గ్రామస్తులు బుధవారం ధర్నా చేశారు. పెదపట్నంలోని కనకదుర్గ ఆలయం ఎదురుగా ఆర్ అండ్‌బీ రోడ్డులో పంటబోదెపై నిర్మించిన శ్లాబ్ కల్వర్టు టిప్పర్ల ధాటికి దెబ్బతిని కూలిపోయిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిందన్నారు. శ్లాబ్ కల్వర్టు దెబ్బతిన్న సమయంలోనే ఇక్కడి పరిస్థితిని సంబంధిత అధికారులకు వివరించినా వారు పట్టించుకోలేదన్నారు. అప్పట్లో టిప్పర్ల రాకపోకలను నిరోధించని పక్షంలో ప్రయోజనం ఉండేదన్నారు. టిప్పర్లను అదుపు చేయకపోవడం వల్ల అది కూలిపోయిందని, దీని వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు. రెవెన్యూ అధికారులు దీనిపై స్పందించి చర్యలు తీసుకుని ఉంటే కల్వర్టు కూలిపోయే పరిస్థితి వచ్చేది కాదన్నారు. కేవలం అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా టిప్పర్లను అదుపుచేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో గుబ్బల పండు, కొమ్ముల సత్యనాగభూషణం, గోగి రామ్మూర్తి, ముత్యాల రాంబాబు, బొక్కా చిన్న, కొమ్ముల శ్రీనివాసు, ఆకుమర్తి రమణ, కట్టా సత్తిబాబు, ఏడిద లక్ష్మణరావు, కాజులూరి కిశోర్ పాల్గొన్నారు.

రూ.28 లక్షలతో కోనేరు ఆధునీకరణ పనులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని కోనేరులో రూ.28 లక్షలతో చేపట్టిన ఆధునీకరణ పనులు ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ధర్మకర్తల ఆధ్వర్యంలో బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వంలో నాలుగున్నరేళ్ల కిందట అప్పటి ధర్మకర్తల మండలి ఈ కోనేరును దాదాపు రూ.20 లక్షలతో ఆధునీకరించినా నాణ్యత లోపాల కారణంగా కాంక్రీట్ పనుల్లో డొల్లతనం బయటపడి శిథిలావస్థకు చేరుకుంది. ఈ ఏడాది మార్చి నెలలో జరిగిన స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన తెప్పోత్సవం సందర్భంగా కోనేరులోని నీటిని మార్చే ప్రయత్నంలో గట్లు బలహీన పడి కూలిపోయాయి. దీంతో ప్రస్తుత ధర్మకర్తల మండలి భక్తుల సౌకర్యార్థం కోనేరు అడుగు భాగంలో కాంక్రీటును, గట్లను పటిష్టంగా నిర్మించేందుకు ఆధునీకణ పనులు చేపట్టారు. పనులు మొదలయ్యాయి.